సాక్షి
వికారాబాద్
బుధవారం, 13, ఆగస్టు, 2025



దోమకాటు.. చేటు

ఇటీవల దంచి కొడుతున్న వర్షాలకు గ్రామాలు, పట్టణాల్లోని వీధులు బురదమయంగా తయారయ్యాయి.
8లో▸



రక్షణ కల్పించాలి

హిందూ ఆలయాలకు రక్షణ కల్పించాలని ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహయాదవ్ కోరారు.
8లో▸



నత్తనడకన నిర్మాణ పనులు

వర్షాల నేపథ్యంలో ఇసుక లభ్యత లేని కారణంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి.
9లో▸

పొడిగింపా.. తొలగింపా?



తాండూరులోని ఎల్మకన్నె పీఏసీఎస్ కార్యాలయం

- ఈ నెల14తో ముగియనున్న పీఏసీఎస్ పాలక వర్గాల పదవీ కాలం
- ఇప్పటికే ఆరునెలల పొడిగింపు

తాండూరు: పీఏసీఎస్ పాలక వర్గాల పదవీకాలం ఈ నెల 14తో ముగియనుంది. ఈ ఏడాది ఫిబ్రవరి 14వ తేదీతోనే వారి గడువు ముగియగా ప్రభుత్వం ఆరు నెలలు పొడిగించిన విషయం తెలిసిందే. అయితే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నందున రైతు సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తారా లేదా అనే సందేహాలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎన్నికల కోసం రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఈ సారైనా ప్రభుత్వం ఎన్నికలు నిర్వహిస్తుందా లేకుంటే గడువు పొడిగిస్తుందా అనే దానిపై స్పష్టత రావడం లేదు. ఇదిలా ఉండగా సహకార ఎన్నికల విషయంలో ప్రభుత్వం కొత్త చట్టాన్ని తేవాలని చూస్తున్నట్లు సమాచారం.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో..

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలో(వికారాబాద్, రంగారెడ్డి, మెడ్చల్) మొత్తం 51 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఉన్నాయి. వీటికి 2019లో ఎన్నికలు జరిగాయి. అప్పట్లో వికారాబాద్ జిల్లాలో అత్యధిక సంఘాలను బీఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకొని పాలక వర్గాలను ఏర్పాటు చేసింది. నాడు డీసీసీబీ పాలక వర్గాన్ని, పీఏసీఎస్ చైర్మన్లను కలిసి బీఆర్ఎస్ పార్టీకి చెందిన బుయ్యని మనోహర్‌రెడ్డి(ప్రస్తుత తాండూరు ఎమ్మెల్యే) డీసీసీబీ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో మనోహర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ప్రస్తుతం డీసీసీబీ చైర్మన్‌గా సత్తయ్య, వైస్ చైర్మన్‌గా రవిగౌడ్ కొనసాగుతున్నారు. వీరి పదవీ కాలం రెండు రోజుల్లో ముగియనుంది.

డీసీసీబీ విభజన జరిగేనా?

హైదరాబాద్‌తో కలిపి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఒకే డీసీసీబీగా కొనసాగుతోంది. కొత్త జిల్లాల ఏర్పాటుతో ఉమ్మడి రంగారెడ్డిని మూడు జిల్లాలుగా ఏర్పాటు చేశారు. ఐదేళ్ల క్రితం వికారాబాద్ జిల్లాలో డీసీసీబీ బ్యాంక్ ఏర్పాటుకు అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఇదిలా ఉండగా డీసీసీబీ పాలకవర్గాన్ని రద్దు చేసి నామినేటెడ్ తరహాలో పదవులు ఇచ్చేందుకు ప్రభుత్వం కొత్త చట్టం తీసుకువచ్చే సూచనలు కనిపిస్తున్నాయి.

మరో అవకాశం ఇవ్వాలి



వ్యవసాయ సహకార సంఘాల పాలకవర్గాల పదవీ కాలం పొడిగింపుపై ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. మరో దఫా పొడిగించాలని తాము కోరుతున్నాం. మరో రెండు రోజుల వ్యవధిలో పదవీకాలం ముగుస్తుంది. సర్కారు నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నాం.

– రవిగౌడ్, వైస్ చైర్మన్, డీసీసీబీ, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా



పాల్గొన్న జిల్లా అధికారులు

అప్రమత్తంగా ఉండండి

- భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలి
- జిల్లా ప్రత్యేక అధికారి, సెర్ప్ సీఈఓ దివ్యా దేవరాజన్

అనంతగిరి: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండ చూడాలని జిల్లా స్పెషల్ ఆఫీసర్, సెర్ప్ సీఈఓ దివ్యా దేవరాజన్ అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో భారీ వర్షాలు పడుతున్నందున అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పొంగిపొర్లుతున్న చెరువులు, వాగులు, వంతెనల వద్ద ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న ప్రాంతాల వద్దకు వెళ్లకుండా చూడాలన్నారు. వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. లీకేజీ అవుతున్న గురుకుల, పాఠశాల భవనాలకు తక్షణం మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. పాతబడిన భవనాలు, ఇళ్లను గుర్తించి వాటిలో ప్రజలు ఉండకుండా చూడాలన్నారు. మురుగు నీరు, వర్షపు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు పాటించాని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడటంతోపాటు వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి, ఆర్డీఓ వాసుచంద్ర, డీఆర్డీఓ శ్రీనివాస్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న దివ్యా దేవరాజన్

న్యూస్‌రీల్

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోండి

ఏడీఏ శంకర్ రాథోడ్



రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏడీఏ శంకర్ రాథోడ్

దుద్యాల్: భూమి ఉన్న ప్రతి ఒక్కరూ రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని కొడంగల్ ఏడీఏ శంకర్ రాథోడ్ సూచించారు. మంగళవారం మండలంలోని హకీంపేట్ రైతు వేదికలో అన్నదాతల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఒక గుంట భూమి ఉన్న రైతుకు కూడా ఈ పథకం వర్తిస్తుందన్నారు. 14-08-1966 నుంచి 14-08-2007 మధ్య జన్మించిన వారు అర్హులన్నారు. ఆధార్ కార్డు, పట్టాపాసు పుస్తకం, బ్యాంక్ ఖాతా పుస్తకం, నామినీ ఆధార్ కార్డు, నామినీ బ్యాంక్ అకౌంట్ పుస్తకంతో స్థానిక ఏఈవోలను సంప్రదించాలని సూచించారు. అనంతరం మండలంలోని ఫెర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి నాగరాజు, ఏఈవో మాణికేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

దుద్యాల్ ఆయుర్వేదిక్ వైద్యుడిగా సుశీల్ కుమార్



దుద్యాల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆస్పత్రి వైద్యుడిగా సుశీల్ కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దీర్ఘకాలిక వ్యాధులకు ఆయుర్వేదంలో పలు చికిత్సలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. బీపీ, షుగర్, కీళ్ల నొప్పులు వంటి వివిధ రకాల చికిత్సలు చేయనున్నట్లు వివరించారు. ప్రజలు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

డీఈఓ రేణుకాదేవి



శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న డీఈఓ రేణుకాదేవి

అనంతగిరి: మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ రేణుకాదేవి సూచించారు. ఏకల్, గ్రామోథన్ ఫౌండేషన్ల ఆధ్వర్యంలో 400 మంది మహిళలు 90 రోజుల పాటు వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ పొందారు. మంగళవారం వికారాబాద్ పట్టణంలో శిక్షణ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు పురుషులకు దీటుగా అన్ని రంగాల్లో రాణించాలన్నారు. 90 రోజుల్లో కంప్యూటర్, బ్యూటీషియన్, కుట్టు తదితర శిక్షణ పూర్తి చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు ప్రభాగ్, రాజేందర్, శ్రీధర్‌రెడ్డి, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌కు విద్యార్థుల ఎంపిక

అనంతగిరి: హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఒకటవ తరగతి ప్రవేశం కోసం లాటరీ పద్ధతిన ఎస్టీ విద్యార్థులను ఎంపిక చేశారు. 2025 – 26 సంవత్సరానికి నలుగురు విద్యార్థులను అదనపు కలెక్టర్ సుధీర్, గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అభివృద్ధి కమలాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. హర్ష వర్ధిని సాయి అన్గోత్, విస్లావాత్ ప్రతీక్ష, కత్రావాత్ వైభవ్, పాత్లవత్ అభినందన్ ఎంపికైనట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎంలు సుందర్ రాజు, ఎస్ విక్రం సింగ్ తదితరులు పాల్గొన్నారు.



సమస్యను అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌కు విన్నవిస్తున్న మీర్జాపూర్ రైతులు

మా కడుపు కొట్టొద్దు

- ఫ్యాక్టరీని విస్తరిస్తే చావే శరణ్యం
- అనుమతులు ఇస్తే న్యాయ పోరాటం చేస్తాం
- ప్రజాభిప్రాయ సేకరణలో తేల్చి చెప్పిన మీర్జాపూర్ రైతులు
- కార్యక్రమాన్ని బహిష్కరించి నిరసన

పూడూరు: 'గతంలో మాయమాటలు చెప్పి ప్రమాదకర ఫ్యాక్టరీ పెట్టారు.. పరిశ్రమ నుంచి వెలువడే వ్యర్థ, వాయు కాలుష్యం కారణంగా పంటలు ఎండిపోతున్నాయి.. దీంతో ఆర్థికంగా నష్టపోతున్నాం.. ఇప్పుడు ఫ్యాక్టరీని విస్తరించి మా పొట్ట కొట్టాలని చూస్తున్నారు.. దీన్ని ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించబోము' అని మీర్జాపూర్ రైతులు తేల్చి చెప్పారు. మంగళవారం పూడూరు మండలం మీర్జాపూర్ పరిధిలోని సుందర్ సింథటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ విస్తరణ కోసం అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. విషయం తెలుసుకున్న రైతులు, గ్రామస్తులు అక్కడి వచ్చారు. రెండు నెలల క్రితం ఇదే అంశంపై సమావేశం నిర్వహించగా తాము వ్యతిరేకించామని, మళ్లీ ఎందుకు వచ్చారని నిలదీశారు. పరిశ్రమ నుంచి వచ్చే వాసన భరించలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వాయు కాలుష్యం కారణంగా పంటలు దెబ్బతింటున్నాయని అధికారులకు విన్నవించారు. తక్షణం ఫ్యాక్టరీని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. బోర్లు, బావుల్లో నీరు రంగు మారుతోందని, రోగాల బారిన పడుతున్నామని రైతులు తెలిపారు. పరిశ్రమను విస్తరిస్తే చావే శరణ్యమన్నారు. వందల మంది పోలీసుల సమక్ష్యంలో అభిప్రాయ సేకరణ చేయడం ఏమిటని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. పరిశ్రమను విస్తరించాలని చూస్తే హైకోర్టును ఆశ్రయిస్తామని రైతులు స్పష్టం చేశారు. అనంతరం మూకుమ్మడి కార్యక్రమాన్ని బహిష్కరించారు. దీంతో అధికారులు తూతూమంత్రంగా కార్యక్రమాన్ని ముగించారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల జీఎం మహేష్, ఆర్డీఓ వాసుచంద్ర, పూడూరు తహసీల్దార్ భరత్‌గౌడ్, పరిగి డీఎస్పీ శ్రీనివాస్, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ భరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కళ్లు మండుతున్నాయి



పొలాల మధ్య కాలుష్య కారక పరిశ్రమను ఏర్పాటు చేశారు. ఫ్యాక్టరీ నుంచి వచ్చే నల్లని పొగతో పంటలు దెబ్బతింటున్నాయి. అంతేకాకుండా కళ్లు మండుతున్నాయి. మత్తు వస్తోంది. పొలాల్లో ఉండలేకపోతున్నాం. ఉన్న పరిశ్రమతోనే వేగలేకపోతుంటే విస్తరించాలని చూస్తున్నారు. దీన్ని ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించం.

– వడ్డె అనంతయ్య, రైతు, మీర్జాపూర్

మా గోడు పట్టించుకోరా..



పరిశ్రమ విస్తరణను ఆది నుంచి వ్యతిరేకిస్తున్నాం. అయినా మా గోడు ఎవరికీ పట్టడం లేదు. వాయు కాలుష్యంతో పంటలు నాశనం అవుతున్నాయి. పెట్టుబడులు పూర్తిగా నష్టపోతున్నాం. ఎర్రమట్టి లారీలు, ఫ్యాక్టరీ కారణంగా అనేక ఇబ్బందులు పడుతున్నాం. ప్రశ్నిస్తే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని ఫ్యాక్టరీ యాజమాన్యం రైతులను బెదిరిస్తోంది.

– రవి, మాజీ సర్పంచ్, మీర్జాపూర్

ఆలయాలను అద్భుతంగా తీర్చిదిద్దాలి

అధికారుల సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

కొడంగల్: నియోజకవర్గంలోని ఆలయాలను అద్భుతంగా తీర్చిదిద్దాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం నగరంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కొడంగల్, దౌల్తాబాద్ మండలాల్లోని వేంకటేశ్వరస్వామి ఆలయాలు, కోస్గిలోని శివాలయం, వేణుగోపాలస్వామి ఆలయాల అభివృద్ధిపై చర్చించారు. వీటిని సమూలంగా అభివృద్ధి చేయాలని సూచించారు. కొడంగల్‌లోని శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో తీర్చిదిద్దాలన్నారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను ఆమోదించారు. ఆలయ డిజైన్లను అధికారులు సీఎంకు చూపించారు. ప్రాకార మండపం, మాఢవీధులు, భూ వరాహ స్వామి ఆలయం, గర్భగుడి, మహా మండపం డిజైన్లను, దౌల్తాబాద్, కోస్గి ఆలయాల డిజైన్లను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ముఖ్య కార్యదర్శులు శేషాద్రి, శ్రీనివాసరాజు, కార్యదర్శి మాణిక్ రాజ్, దేవాదాయశాఖ కమిషనర్ వెంకట్రావ్, కలెక్టర్ ప్రతీక్ జైన్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆలయాల అభివృద్ధిపై అధికారులతో చర్చిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ఏసీబీకి చిక్కిన మహిళా ఉద్యోగి

- కలెక్టరేట్ ఈ– సెక్షన్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నిందితురాలు
- రైతు నుంచి రూ.15వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు



అధికారులకు పట్టుబడిన సుజాత

వికారాబాద్: లంచం తీసుకుంటూ ఓ మహిళా ఉద్యోగి ఏసీబీ అధికారులకు చిక్కింది. కలెక్టరేట్‌లో మంగళవారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. నవాబుపేట మండలం వట్టిమీనపల్లికి చెందిన ఓ రైతు తన రెండెకరాల అసైన్డ్ భూమికి సంబంధించి రికార్డుల్లో తన తల్లి పేరు నమోదు చేయించేందుకు దరఖాస్తు చేసుకున్నాడు. తహసీల్దార్ కార్యాలయం నుంచి వచ్చిన ఫైల్‌ను ఈ– సెక్షన్ నుంచి కలెక్టర్ పేషీకి పంపించాల్సి ఉంది. ఇక్కడ జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సుజాత ఇందుకోసం రూ.5 వేలు డిమాండ్ చేసింది. ఈ మొత్తాన్ని పదిహేను రోజుల క్రితమే రైతు నుంచి గూగుల్ పే చేయించుకుంది. అనంతరం కలెక్టర్ ప్రొసీడింగ్ ఇవ్వగా.. తిరిగి ఆ కాపీని తహసీల్దార్ ఆఫీసుకు పంపించాల్సి ఉంది. రోజులు గడుస్తున్నా ఫైల్ రాకపోవడంతో బాధితుడు వెళ్లి జూనియర్ అసిస్టెంట్ సుజాతను కలిశాడు. దీనిపై స్పందించిన ఆమె ప్రొసీడింగ్ కాపీ తహశీల్దార్ కార్యాలయానికి పంపాలంటే రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేసింది. రూ.15,000 బేరం కుదిరిన అనంతరం బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచన మేరకు సుజాతకు డబ్బులు ఇస్తుండగా ఏసీబీ అధికారులు ఆమెను పట్టుకున్నారు. ఈ– సెక్షన్‌లో సోదాలు నిర్వహించి, పలు ఫైళ్లను పరిశీలించారు. ఆమెను అదుపులోకి తీసుకుని, ఈ వ్యవహారంలో మరెవరి పాత్రయినా ఉందా అనే కోణంలో ఆరా తీస్తున్నారు. నిందితురాలిని ఏసీబీ కోర్టులో హాజరు పర్చి, రిమాండ్‌కు తరలిస్తామని వెల్లడించారు.

లంచం అడిగితే 1064 కాల్ చేయండి..

అధికారులు, ఉద్యోగులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే వెంటనే తమను సంప్రదించాలని, ఇందుకోసం 1064 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి వివరాలు చెప్పాలని ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్ తెలిపారు. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టంచేశారు.

ఆస్తి, ప్రాణ నష్టం జరగొద్దు: ఎస్పీ

అనంతగిరి: భారీ వర్షాల నేపథ్యంలో ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని ఎస్పీ నారాయణరెడ్డి సూచించారు. మంగళవారం నగరం నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్ని జిల్లాల ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాబోయే 72 గంటల పాటు అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఎక్కడ ఏం జరిగినా కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇక్కడ 24 గంటల పాటు సిబ్బంది అందుబాటులో ఉంటారని వివరించారు. సహాయం కావాల్సిన వారు ఫోన్ నంబర్ 084162 35291 79950 61192లకు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ నారాయణరెడ్డి, జిల్లా అధికారులు

సీఎంఆర్ అందజేయాలి

అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

అనంతగిరి: రబీ సీజన్ 2024–25కు సంబంధించిన కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్)ను మిల్లర్లు తక్షణం పూర్తిగా అందజేయాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ ఆదేశించారు. అలాగే ఖరీఫ్, రబీ 2025 – 26 సీజన్ల బియ్యం డెలివరీని వేగవంతం చేయాలన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో రైస్ మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిల్లర్లు వారివారి మిల్లుల సామర్థ్యం మేరకు సీఎంఆర్‌ను ఎఫ్‌సీఐకి అందజేయాలన్నారు. అధికారులు మిల్లుల నుంచి వచ్చే బియ్యం నిల్వకు గోదాంలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. అలాగే తగినంత మంది హమాలీలు నియమించుకోవాలన్నారు. సమావేశంలో డీఎంసీఎస్ మోహన్ కృష్ణ, డీఎస్ఓ సుదర్శన్, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

క్లస్టర్ల వారీగా వివరాలు సేకరించాలి

త్వరలో జిల్లాకు గ్రామ పాలన అధికారులు(జీపీఓ) రానున్నందున క్లస్టర్ల వారీగా ఎంత మంది అవసరం అనే వివరాలు సేకరించాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులకు సూచించారు. మంగళవారం తన ఛాంబర్‌లో అన్ని మండలాల తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాకు గ్రామ పాలన అధికారులు వస్తున్నందున వారిని ఏయే ప్రాంతాల్లో నియమించాలి అనే దానిపై ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. సమావేశంలో ఆర్డీఓ వాసుచంద్ర తదితరులు పాల్గొన్నారు.



రైస్ మిల్లర్లతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

క్లుప్తంగా

ఆలయాలను కూల్చడం ప్రభుత్వానికి సిగ్గుచేటు


దోమలో యాదయ్యను అదుపులోకి తీసుకున్న పోలీసులు

దోమ: హిందూ దేవాలయాలను కూల్చడం సిగ్గుచేటని బీజేపీ జిల్లా కార్యదర్శి మేకల యాదయ్య ప్రభుత్వాన్ని విమర్శించారు. పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన 'పెద్దతల్లికి కుంకుమార్చన' కార్యక్రమానికి తరలి వెళ్తున్న పలువురు బీజేపీ నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారని ఆరోపించారు. కాంగ్రెస్ సర్కారు తీరు మారకపోతే రానున్న రోజుల్లో ప్రజలే సరైన సమాధానం చెబుతారన్నారు.

బీజేపీ నేతల ముందస్తు అరెస్టు


పీఎస్ ఎదుట నాయకులు

అనంతగిరి: బంజారాహిల్స్‌లో పెద్దమ్మ తల్లి ఆలయంలో నిర్వహిస్తున్న కుంకుమార్చన కార్యక్రమానికి వెళ్లడానికి సిద్ధమవుతున్న వీహెచ్‌పీ, బీజేపీ నాయకులను మంగళవారం పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పీఎస్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి ప్రశాంత్‌కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షురాలు యాస్కి శిరీష, నాయకులు శ్రీనివాస్, ఆచారి, మోహన్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

నేలకూలిన వందేళ్ల మర్రి చెట్టు


నేలకూలిన వందేళ్ల మర్రిచెట్టు

పరిగి: దాదాపు 110 ఏళ్ల చరిత్ర గల మర్రి చెట్టు నేలకూలింది. పట్టణ కేంద్రంలోని కొడంగల్ చౌరస్తాలో బాలు టిఫిన్ సెంటర్ ముందు ఉన్న మర్రి చెట్టు చరిత్ర వంద ఏళ్ల పైమాటే. కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మర్రి చెట్టు వేర్లు మెత్తబడి ఒక్కసారిగా నేలకు ఒరిగింది. మంగళవారం ఉదయం 11 గంటలకు మెల్ల మెల్లగా వృక్షం ఒరగడంతో టిఫిన్ సెంటర్ యజమాని గమనించి చుట్టు పక్కల వారికి సమాచారం అందించారు. చెట్టు ఒక్కసారిగా టిఫిన్ సెంటర్‌పై పడటంతో రేకులు మొత్తం దెబ్బతిన్నాయి. ఎప్పుడు రద్దీగా ఉండే ప్రదేశంలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వంద ఏళ్లకు పైగా వయసున్న మర్రి చెట్టు నేలకూలడంతో చూసేందుకు భారీగా ప్రజలు తరలివచ్చారు.

అభివృద్ధికి నిధులివ్వండి


ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కుదురుమల్ల గ్రామస్తులు

దుద్యాల్: గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని మండలంలోని కుదురుమల్ల గ్రామస్తులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామం అన్ని రంగాల్లో వెనుకబడిందని, నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. ఇందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని చెప్పారు. కార్యక్రమంలో గ్రామస్తులు నర్సింహారెడ్డి, యాదగిరి రెడ్డి, జగన్‌మోహన్ రెడ్డి, సూర్య ప్రకాశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బొడ్రాయి ప్రతిష్ఠ

రెండో రోజూ పూజలు

బొంరాస్‌పేట: మండల కేంద్రంలోని అభయాంజనేయస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బొడ్రాయి ప్రతిష్ఠ రెండు రోజులుగా జరుగుతున్నాయి. మంగళవారం అభయాంజనేయస్వామి ఆలయం వద్ద జ్యోషి సత్యనారాయణశర్మ పండిత బృందంచే పంచ నాభిశిలలు, ధ్వజస్తంభానికి జలాదివాసం, ధాన్యాదివాసం, పుష్పాదివాసం, ఫలాదివాసం నిర్వహించారు. ఉదయం గోపూజ, ముఖ్యదేవత, దుర్గామాత, నవగ్రహ హోమాలు, ఆంజనేయస్వామికి సిందూరాభిషేకం, అలంకరణ చేపట్టారు. కృష్ణయ్య నాదస్వరం బృందంచే సన్నాయిమేళం, తీర్థప్రసాదాలు, సాయంత్రం భజన నిర్వహించారు.

నేడు ప్రతిష్ఠ..

మూడో రోజు బుధవారం గ్రామంలోని ఐదు స్థలాల్లో బొడ్రాయి ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అలాగే ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన కార్యక్రమాలు పండుగలా నిర్వహించనున్నట్లు పండితులు శ్రీనివాస రావు, సుధీంద్ర, సునీల్, శ్రీకాంత్, భరద్వాజ్, సంపత్‌లు తెలిపారు.

దోమకాటు.. ఆరోగ్యానికి చేటు

- నిర్లక్ష్యం చేస్తే ప్రాణానికే ముప్పు
- వర్షాలతో దోమల వ్యాప్తికి ఆస్కారం
- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నిపుణుల సూచన


ఆలేడ్‌లో ఇళ్ల మధ్య మురుగు నీరు


దుద్యాల్‌లో వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

దుద్యాల్: ఇటీవల దంచి కొడుతున్న వర్షాలకు గ్రామాలు, పట్టణాల్లోని వీధులు బురదమయంగా తయారయ్యాయి. దీంతో దుర్గంధం ప్రబలి చిత్తడి వాతావరణంలో దోమలు వృద్ధి చెందే ఆస్కారం ఉంది. సీజనల్ వ్యాధులు కలవరపెడుతున్న తరుణంలో దోమకాటు సామాన్యులకు శరాఘాతంగా మారుతుంది. అపరిశుభ్ర వాతావరణం, అస్తవ్యస్తమైన డ్రైనేజీ వ్యవస్థలే దోమలకు ఆవాసాలు. వీటి కాటుకు ప్రాణాంతక వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. జిల్లాలో డెంగీతో మృతిచెందిన సంఘటనలున్నాయి. దోమకాటుతో వచ్చే వ్యాధులు, వాటి లక్షణాలను వైద్యాధికారులు వివరించారు.

వ్యాధుల తీరు ఇలా..

మలేరియా: ఆడ అనాఫిలిస్ దోమ కుట్టడంతో మలేరియా వ్యాధి సోకుతుంది. ఈ వ్యాధితో బాధపడుతున్న రోగిని దోమ కుట్టడంతో దాని కడుపులోకి పరాన్నజీవి ప్రవేశించి అక్కడే పెరుగుతుంది. ఇదే దోమ మరో వ్యక్తిని కుట్టినప్పుడు ఆ వ్యక్తి రక్తంలోకి చేరి మలేరియాకు కారణమవుతుంది.

లక్షణాలు: చలి వణుకుతో కూడిన జ్వరం రావడం, శరీర ఉష్ణోగ్రత పెరగడం, జ్వరం విడిచి విడిచి వస్తుంటుంది.

డెంగీ: పగటి సమయంలో కుట్టే ఏడీస్ ఆడ దోమల ద్వారా డెంగీ వ్యాధి సోకుతుంది. ఇది సాధారణ వైరస్ ఎముకలు, కండరాలు, కీళ్ల నొప్పులతో జ్వరం మొదలవుతుంది.

లక్షణాలు: హఠాత్తుగా తీవ్ర జ్వరం రావడం, కదలలేని స్థితి, ఎముకలు, కండారాలలో భరించలేని నొప్పి, శరీరంపై ఎర్రని దద్దుర్లు, వాంతులు, వికారం, నోరు ఎండిపోవడంతో పాటు చిగుళ్లు, ముక్కు ద్వారా రక్తం వస్తుంది.

చికున్‌గున్యా: ఏడిస్ ఈజిప్‌టై దోమలతో ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. చేతులు, కాళ్లు, కీళ్లలో వాపు వచ్చి కనీసం అడుగు తీసి అడుగు వెయ్యలేని పరిస్థితి ఏర్పడుతుంది. జ్వరంతో మనిషి బలహీనంగా ఉంటాడు.

లక్షణాలు: తలనొప్పి, వాంతులు, వికారంతో పాటు హఠాత్తుగా జ్వరం, కీళ్ల నొప్పులు, సరిగా నిలబడలేకపోవడం వంటివి.

ఫైలేరియా: దీనిని బోదకాలు అని కూడా అంటారు. క్యూలెక్స్ దోమ ద్వారా ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. శరీరంలోని ఏ భాగానికైనా బోదకాలు సోకుతుంది.

లక్షణాలు: తరచూ జ్వరం, చంకలు, కాళ్ల భాగంలో బిళ్లలు కట్టడం, వెన్నుముక దగ్గర నుంచి అన్ని అవయవాలపై ప్రభావం చూపుతుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

డెంగ్యూ, చికెన్‌గున్యా, మలేరియా వంటి ప్రాణాంతకమైన వ్యాధులను నివారించాలంటే వైద్యం ఇంటి నుంచే ప్రారంభం కావాలంటున్నారు పెదలు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే తప్పా దోమల నియంత్రణ పూర్తిగా సాధ్యం కాదు. కాబట్టి ఎవరికి వారు ఇంటి లోపల దోమలు లేకుండా చూసుకోవడం మంచిది. దోమ తెరను ఉపయోగించాలి. వేపనూనె, కొబ్బరినూనె, నిమ్మరసం మిశ్రమాన్ని చర్మంపై రాసుకోవడం ద్వారా దోమల నుంచి విముక్తి పొందవచ్చు. ఇంట్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. టీ, కాఫీ పొడర్‌ను నిల్వ నీటిలో చల్లినట్‌లైతే దోమల గుడ్లు నిర్వీర్యమవుతాయి.

నిర్లక్ష్యం చేయొద్దు



వర్షాలకు చల్లటి గాలి వీచడంతో విష జ్వరాలు సోకే అవకాశాలున్నాయి. చిన్న, పెద్దలు అనే తేడా లేకుండా వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంది. ఎవరూ నిర్లక్ష్యం చేయవద్దు. సాధారణ జ్వరం ఉన్న చికిత్స చేయించుకోవాలి. నిర్లక్ష్యం చేస్తే ప్రమాదంగా మారే అవకాశం ఉంది.

– డాక్టర్ వందనరాజన్, హకీంపేట్

అస్తవ్యస్తంగా మల్కాపూర్


ఎస్సీకాలనీలో రోడ్డు పక్కనే పేరుకుపోయిన పిచ్చిమొక్కలు

నిధులు లేక అభివృద్ధి పనుల నిలిపివేత

తాండూరు రూరల్: మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామంలో పారిశుద్ధ్యం లోపించింది. ప్రత్యేకాధికారి ఇప్పటివరకు ఊరికి వచ్చిన దాఖలాలు లేవని స్థానికులు ఆరోపిస్తున్నారు. పారిశుద్ధ్య నిర్వహణ, చెత్త సేకరణ, వీధి లైట్ల ఏర్పాటు ఇలా అన్ని అంశాల్లో పురోగతి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే చాలాసార్లు వినతిపత్రాలు సమర్పించినా ఎలాంటి చర్యలు లేవని గ్రామస్తులు పేర్కొంటున్నారు. గ్రామ పంచాయతీలో నిధుల కొరత ఉందని కార్యదర్శి ఇస్మాయిల్ తెలిపారని చెప్పారు. ఇకనైనా తమ గ్రామాన్ని పట్టించుకోవాలని అధికారులను వేడుకొంటున్నారు.


గ్రామంలో వెలగని విద్యుత్ దీపం

రైతులకు ఇబ్బందులు రానీయొద్దు

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి


విద్యుత్ అధికారుల సమీక్షలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: విద్యుత్ అధికారులు ఎప్పుడూ ప్రజలకు, రైతులకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సూచించారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విద్యుత్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లోని విద్యుత్ సమస్యలను వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వర్షాకాలం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యుత్ సమస్యలు గ్రామాల్లో చాలా ఉన్నాయని వాటిని తెలుసుకుని ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. విద్యుత్ అంతరాయం కలుగకుండా అందుబాటులో ఉండి వాటిని పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వం ప్రజలకు 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్‌ను అందజేస్తుందని తెలిపారు. విద్యుత్ అధికారులు ఎవరైనా విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలి


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మురళీ మోహన్ తదితరులు

సాధన ఎన్జీవో డైరెక్టర్ మురళీమోహన్

అనంతగిరి: రాష్ట్రంలో విద్యాహక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని సాధన ఎన్జీవో డైరెక్టర్ చిక్కు మురళీమోహన్ పేర్కొన్నారు. మంగళవారం వికారాబాద్ పట్టణంలోని డైట్ కళాశాలలో యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ యూనిట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అన్వర్ పాషా, సాధన సంస్థ జిల్లా కోఆర్డినేటర్ రమేష్ యాదవ్‌తో కలిసి విద్యాహక్కు చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మురళీమోహన్ మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం సక్రమంగా అమలయ్యేందుకు ప్రభుత్వం ఒక పంచవర్ష ప్రణాళిక విధానాన్ని రూపొందించాలని తెలిపారు. విద్యా సామర్థ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర జనాభాలో బాలల సంఖ్య సుమారు 40 శాతానికి పైగా ఉందని, దీనిపై సమగ్రమైన సర్వే నిర్వహించి, బాల కార్మికుల సంఖ్యను వాస్తవికంగా నిర్ధారించాలని డిమాండ్ చేశారు. 18 ఏళ్లలోపు బాల బాలికలందరికీ ఉచిత నిర్బంధ విద్య అందేలా చట్ట సవరణ చేయాలని కోరారు. అనంతరం సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలకు సంబంధించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏహెచ్‌టీయూ హెడ్ కానిస్టేబుల్ అలీమోద్దీన్, అసిస్టెంట్ కోఆర్డినేటర్ నర్సింహులు, సఖీ సెంటర్ కోఆర్డినేటర్ యశోద, లీగల్ కౌన్సిలర్ సుమలత, షీటీం ప్రతినిధి రేష్మ, డైట్ కళాశాల సూపరింటెండెంట్ హుస్సేన్ సయ్యద్, ధారూర్ మాజీ సర్పంచ్ చంద్రమౌళి, సంస్థ ప్రతినిధులు అంజయ్య, ఆసీమ, రోజా, ప్రకాశ్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

ధారూరు: మండల పరిధిలోని నాగసమందర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ట్రైనీ కలెక్టర్ హర్షచౌదరి ఆకస్మిక తనిఖీ చేశారు. ఆస్పత్రిలో అన్ని వార్డులను కలియ తిరిగి చూశారు. పలు రిజిస్టర్లను పరిశీలించారు. ఆస్పత్రిలో ఖాళీల పోస్టుల వివరాలను డాక్టర్ జ్యోతిని అడిగి తెలుసుకున్నారు. ఆయూష్ విభాగంలో డాక్టర్, సిబ్బంది ఎవరూ లేకపోడంపై విస్మరించారు. రోగుల సేవలు, వసతులు, పరికరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చిన రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఆస్పత్రిలో ఫార్మసిస్ట్ పోస్టు ఖాళీగా ఉందని, ఆ పోస్టు భర్తీ అయ్యేలా చూడాలని డాక్టర్ జ్యోతి ట్రైనీ కలెక్టర్‌కు విన్నవించారు.

ఎక్మాయి యువకుడికి డాక్టరేట్


డాక్టరేట్ పట్టా పొందిన వెంకటప్ప

బషీరాబాద్: మండలంలోని ఎక్మాయి గ్రామానికి చెందిన పోషమొళ్ల వెంకటప్ప ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా అందుకోనున్నారు. విశ్వవిద్యాలయ హ్యాండ్ బాల్ క్రీడాకారులలో శారీరక దారుఢ్యం శారీరక శాస్త్ర సంబంధిత విలువల అభివృద్ధి, శిక్షణ పద్ధతులు వాటి ప్రభావం అనే అంశంపై పీహెచ్‌డీ పూర్తి చేశారు. మారుమూల గ్రామంలో పుట్టి పెరిగి పీహెచ్‌డీ పట్టా పొందడం మండలానికే ఆదర్శమని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. క్రీడారంగంలో వెంకటప్ప అద్భుతమైన ప్రతిభను చాటారు. గతంలో ఉస్మానియా యూనివర్సిటీ హ్యాండ్ బాల్ జట్టుకు ప్రాతినిథ్యం వహించి సీనియర్ నేషనల్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో కాంస్యపతకం సాధించారు. ఈ నెల 19వ తేదీన యూనివర్సిటీలో గవర్నర్ ఇస్రో మాజీ చైర్మన్, వైస్ చాన్స్‌లర్ చేతుల మీదుగా పీహెచ్‌డీ ప్రదానం చేయనున్నారని వెంకటప్ప మంగళవారం తెలిపారు.

వివాహిత అదృశ్యం


గీత (ఫైల్)

కేశంపేట: ఓ వివాహిత అదృశ్యమైన ఘటన మండల పరిధిలోని లేమామిడి గ్రామంలో వెలుగు చూసింది. వివరాలు ఉన్నాయి. గ్రామానికి చెందిన సంపంగి మల్లేశ్‌కు కల్వకుర్తి మండలం సిలార్‌పల్లి గ్రామానికి చెందిన గీతతో గతేడాది వివాహం జరిగింది. అయితే గీత రాఖీ పండగకు పుట్టింటికి వెళ్లి వస్తానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో భర్త ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అప్పుల బాధతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య

మాడ్గుల: అప్పుల బాధ భరించలేక పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మాడ్గుల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం.. దొడ్లపహాడ్‌కు చెందిన జంగయ్యగౌడ్ (38)నగరంలో ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇటీవల అప్పుల బాధలు ఎక్కువ కావడంతో ఇంటికి వచ్చాడు. సోమవారం తన పొలానికి పురుగుల మందు తాగాడు. అక్కడికి వెళ్లిన భార్యాపిల్లలు ఇది గమనించి చికిత్స నిమిత్తం కల్వకుర్తి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు.

పనితీరు మార్చుకోండి

- ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఎంఈఓ హెచ్చరిక
- గుంతబాస్పల్లి ప్రాథమిక పాఠశాలలో విచారణ

సాక్షి ఎఫెక్ట్..


గుంతబాస్పల్లి పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎంఈఓ వెంకటయ్య

తాండూరు రూరల్: ప్రభుత్వ ఉపాధ్యాయులు నిబద్ధతతో పని చేయాలని ఎంఈఓ వెంకటయ్య ఆదేశించారు. 'తాళం వేయబడి' శీర్షికతో మంగళవారం సాక్షిలో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. సోమవారం తెరుచుకోని గుంతబాస్పల్లి ప్రాథమిక పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు. హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. పాఠశాలకు సోమవారం లోకల్ హాలిడే ఇవ్వాల్సిన అవసరం ఏమొచ్చిందని హెచ్‌ఎం జగన్నాథం, టీచర్ సంగీతను ప్రశ్నించారు. తల్లిదండ్రులతో కూడా మాట్లాడి వివరాలు సేకరించారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ.. సమయ పాలన పాటిస్తూ, విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలని సూచించారు. ఇప్పటికే మెమోలు తీసుకున్న నేపథ్యంలో విధుల్లో మరోసారి అలసత్వం ప్రదర్శిస్తే కలెక్టర్, డీఈఓకు ఫిర్యాదు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. తమ అంగీకారం మేరకే సోమవారం స్కూల్‌కు సెలవు ప్రకటించారని విద్యార్థుల తల్లిదండ్రులు లిఖిత పూర్వకంగా రాసి ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది. ఈ కార్యక్ర మంలో మాజీ సర్పంచ్ జగదీశ్, అజ్గర్, దస్తయ్యగౌడ్ తదితరులు ఉన్నారు.

కోట్‌పల్లి పీహెచ్‌సీ పరిశీలన


పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంసీహెచ్ ప్రోగాం ఆఫీసర్ పవిత్ర

బంట్వారం: వారానికోసారి నిర్వహించే ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలని ఎంసీహెచ్ ప్రోగ్రాం జిల్లా అధికారి డాక్టర్ పవిత్ర అన్నారు. మంగళవారం కోట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆరోగ్య మహిళను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. రోగులతో మాట్లాడి ఆరోగ్య సమస్యలు తెలుసుకున్నారు. 15 సంవత్సరాల నుంచి 50 ఏళ్ల లోపు మహిళలకు తప్పనిసరిగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించాలన్నారు. అనంతరం ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలకు సంబంధించిన వైద్య సేవలపై మెడికల్ ఆఫీసర్ మేఘనను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ ఆఫీసర్ నిరోష, డాక్టర్లు మేఘన, బీబీజానీ ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

హిందూ ఉత్సవ సమితి ఎన్నిక


హిందూ ఉత్సవ కేంద్ర సమితి కార్యవర్గం సభ్యులు

తాండూరు టౌన్: తాండూరు హిందూ ఉత్సవ కేంద్ర సమితి పూర్తి స్థాయి కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. ఈ మేరకు సమితి అధ్యక్షులు తాటికొండ స్వప్న, ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల నర్సిములు 40 మందితో కూడిన కార్యవర్గాన్ని ప్రకటించినట్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గౌరవాధ్యక్షులుగా రాజుగౌడ్, కోశాధికారిగా రొంపల్లి సంతోష్ కుమార్ కొనసాగుతుండగా తాజాగా ఉపాధ్యక్షులు, సహా కార్యదర్శులు, అధికార ప్రతినిధి, కార్య నిర్వాహక కార్యదర్శులు, సాంస్కృతిక కార్యదర్శులు, సమన్వయ కమిటీ, ప్రచార కార్యదర్శులు, న్యాయ సలహాదారులు, ఆధ్యాత్మిక సలహాదారులను నియామకం చేశారు. అలాగే ముఖ్య సలహాదారులుగా పలువురు పట్టణ ప్రముఖులను నియమించారు. ఈ కార్యవర్గం 2025–26 సంవత్సరానికి గాను హిందూ సంప్రదాయ పండగల నిర్వహణ, ఉత్సవాల నిర్వహణకు తమ సేవలను అందించనున్నట్లు సమితి అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు.

కార్మికులను పర్మినెంట్ చేయాలి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్


మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు

తాండూరు టౌన్: తాండూరు మున్సిపాలిటీలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట పలువురు నాయకులతో కలిసి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏళ్ల తరబడిగా మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తోందన్నారు. వారందరినీ వెంటనే పర్మినెంట్ చేయాలని, అప్పటి వరకు నెలకు రూ.26 వేల చొప్పున కనీస వేతనం చెల్లించాలన్నారు. కార్మికుల పీఎఫ్‌ను వారి ఖాతాల్లో సక్రమంగా జమ చేయడం లేదని, ఈఎస్ఐ అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. కార్మికులకు పెండింగ్‌లో ఉన్న యూనిఫాంలు, సబ్బులు, నూనె వెంటనే అందించాలని, డ్రైవర్ల వేతనాలను పెంచాలని, లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామన్నారు. కార్యక్రమంలో మైనార్టీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ వాహబ్, సీఐటీయూ తాండూరు మున్సిపల్ వర్కర్స్ గౌరవాధ్యక్షుడు రాములు, వర్కింగ్ ప్రెసిడెంట్ నరేష్, నాయకులు భాస్కర్, అశోక్, గోపి, ముకుంద్, లక్ష్మణ్, మల్లప్ప, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భూమి విరాసత్ చేయడం లేదని..


పెట్రోల్ పోసుకున్న యువకుడిని కాపాడుతున్న స్థానికులు


తల్లి నర్సమ్మతో బాధితుడు నందకిషోర్

- ఒంటపై పెట్రోల్ పోసుకుని యువకుడి ఆత్మహత్యాయత్నం
- కుల్కచర్ల తహసీల్ కార్యాలయం ఎదుట ఘటన

కుల్కచర్ల: వారసత్వంగా వచ్చిన భూమిని విరాసత్ చేయకుండా రెవెన్యూ అధికారులు ఇబ్బంది పెడుతున్నారని మనస్తాపానికి గురైన ఓ యువకుడు పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మంగళవారం కుల్కచర్ల తహసీల్ కార్యాలయం ఎదుట చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. ఘనపూర్ గ్రామానికి చెందిన కామునిపల్లి రాములుకు కుల్కచర్ల రెవెన్యూ సర్వేనంబర్ 626/6, 626/1లో ఎనిమిదెకరాల ప్రభుత్వ భూమి ఉంది. 2019లో రాములు మృతి చెందగా, అప్పటి నుంచి భూమిని విరాసత్ చేసుకోలేదు. తన తండ్రి పేరున ఉన్న భూమిని తల్లి నర్సమ్మ పేరున మార్చాలని కోరుతూ 2025 జూన్ 23న బాధితుడు నందకిషోర్ అధికారులను కలిశాడు. దస్త్రాలను పరిశీలించిన అధికారులు మీరు కాస్తులో లేరని చెప్పాడన్నారు. ఈ విషయమై తాము కోర్టును ఆశ్రయించగా ఆర్డర్ కాపీ ఇచ్చిందని తెలిపాడు. న్యాయస్థానం ఆర్డర్ కాపీతో వెళ్లి తమ భూమిని విరాసత్ చేయాలని కోరినా.. అధికారులు పట్టించుకోలేదని వాపోయాడు. దీంతో మనస్తాపానికి గురై ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. అక్కడున్న వారు గమనించి పెట్రోల్ డబ్బాను లాక్కున్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని యువకుడికి నచ్చజెప్పారు. ఈ విషయంపై తహసీల్దార్ మనోహర్ చక్రవర్తిని వివరణ కోరగా.. బాధిత రైతు సర్వే నంబర్ పీఓటీ కింద కేసు నమోదై ఉందన్నారు. దీంతో దరఖాస్తును ఆర్డీఓకు పంపించామని తెలిపారు.

దేవాలయాలకు రక్షణ కల్పించాలి


పోలీసుల అదుపులో నాయకులు

బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహయాదవ్

కేశంపేట: రాష్ట్రంలోని హిందూ దేవాలయాలకు రాష్ట్ర ప్రభుత్వం రక్షణ కల్పించాలని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు పసుల నర్సింహయాదవ్ అన్నారు. ఇటీవల హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో ఉన్న పెద్దమ్మ తల్లి దేవాలయం వద్ద పాక్షికంగా గోడను ధ్వంసం చేయడంతో బీజేపీ పిలుపు మేరకు చలో పెద్దమ్మతల్లి కార్యక్రమంలో భాగంగా మంగళవారం కుంకుమార్చన నిర్వహించేందుకు పార్టీ నాయకులు సిద్ధమయ్యారు. దీంతో కేశంపేట పోలీసులు మండలంలో పార్టీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి.. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ఆధ్వర్యంలో శాంతియుతంగా నిర్వహించ తలపెట్టిన చలో పెద్దమ్మతల్లి కార్యక్రమాన్ని అడ్డుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో హిందువులకు, దేవాలయాలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. స్థానిక సంస్థల మండల కన్వీనర్ కంచుకోట మహేశ్, సంస్కృతిక శాఖ జిల్లా కో–కన్వీనర్ కర్రెడ్ల నరేందర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి తిరుపతి, యాదయ్య, కోటి చేశారు.